## రాష్ట్రస్థాయికి ఎంపికైన తాడిపత్రి విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులు

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త

జిల్లా కేంద్రంలో జరిగిన స్కూల్ గేమ్స్ స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీల్లో తాడిపత్రి విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇందులో అండర్–14 బాలికల విభాగంలో పి.హైందవి (కాంస్యం), సి.పూజిత (రజతం), బాలుర విభాగంలో ఎస్.భాను అఖిల్ (కాంస్యం), అండర్–17 బాలుర విభాగంలో జి.రామ్‌చరణ్ (బంగారం), బి.హేమంత్ (రజతం), అండర్–19 విభాగంలో వి.హరి (కాంస్యం) సాధించి కాకినాడలో జరగబోయే రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని కోచ్ మధు తెలిపారు.

## నందలపాడులో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త



కుంటను పూడ్చి వేయిస్తున్న కౌన్సిలర్

పట్టణంలోని నందలపాడులో మంగళవారం వార్డు కౌన్సిలర్ విజయ్ కుమార్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం తుఫాన్ కారణంగా వర్షాలు పడుతుండడం వల్ల కుంటల్లో వర్షం నీరు నిల్వ వుండకుండా మట్టితో పూడిపించారు. వర్షం నీరు కుంటల్లో నిల్వ వుండడం వల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశం వుండడంతో మున్సిపాలిటీకి చెందిన జెసిబితో ఆయా కుంటల్లో మట్టిని తోలి చదును చేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులను అభినందించిన రమేష్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త

శ్రీకాకుళంలో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్–19 రాష్ట్ర లెవెల్ ఉమెన్స్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎన్నికకావడంతో పాటు అనంతపురం జిల్లా జట్టును చరిత్రలో మొదటిసారిగా రన్నర్స్‌గా నిలిపిన టెక్ జూనియర్ కళాశాల విద్యార్థి, అనంతపురం జిల్లా జట్టు కెప్టెన్ గౌతమి, సహనలకు టెక్ విద్యాసంస్థల చైర్మన్ రమేష్‌రెడ్డి, సెక్రటరీ సురేష్‌రెడ్డిలు పట్టణంలోని రమేష్‌రెడ్డి నివాసంలో శుభాకాంక్షలు తెలియచేస్తూ అభినందించారు.

## ఘనంగా డాక్టర్ అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

యాడికి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామంలో వున్న న్యూ వికాస్ పాఠశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి డాక్టరనఅబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అబ్దుల్‌కలాం చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్‌గా పిలువబడే అబ్దుల్‌కలాం నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికి చదువుతోనే ఉన్నత స్థితికి చేరుకోవడం పాటు తాను అనుకున్న లక్ష్యాలను సాధించగలిగారన్నారు. అంతేకాకుండా దేశం గర్వించతగ్గ శాస్త్రవేత్తగా అబ్దుల్‌కాలంనఎదిగారని ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం భారతరత్న అవార్డుతో సత్కరించిందన్నారు. ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని ఆయన విద్యార్థులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రజిత, అనిత, అమల, గీత, ధరణి, జాహ్నవి, ప్రియాంక, కృష్ణవేణి, సంధ్య, వెంకటపతి, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో పల్లె పండుగ



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

యల్లనూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలోని తిరుమలాపురం, చిలమకూరు గ్రామాల్లో మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపిడిఒ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నాలుగు పనులకు సంబంధించి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, ఏపిఒ షబ్బీర్‌బాష, టిడిపి నాయకులు శ్రీనివాసులరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రత్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా గ్యార్మీ వేడుకలు

యాడికి, అక్టోబర్ 15 ప్రభాతవార్త



గంధం తీసుకెళుతున్న దృశ్యం

మండలంలోని యాడికి, వేములపాడు, రాయలచెరువు, తదితర గ్రామాల్లో మంగళవారం ముస్లింసోదరులు గ్యార్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాడికిలోని లాలాలవీధి, మెయిన్‌బజార్, మహబూబ్‌సుబాని జెండా కట్టల వద్ద రాయలచెరువు మహబూబ్‌సుబాని జెండా కట్టల వద్ద ముస్లిం మత పెద్దలు ప్రత్యేక పాతెహా, దరూద్ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి గంధంను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వేములపాడులో ఓ భక్తురాలు దీపాలను స్వామివారి సేవకు అందచేసింది. ఈ కార్యక్రమంలో ముస్లింమత పెద్దలు గ్యార్మీ పర్వదిన విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## పంట పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందచేస్తున్న సిపిఐ నాయకులు

పుట్లూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఐ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి మంగళవారం వినతిపత్రం అందచేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరకటవేముల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు సిపిఐ నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారని ఆ రైతులు అపులపాలు కాకుండా వుండాలంటే పంట పెటుబడిసాయం, రైతు భరోసా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. రైతుల పొలాలకు వెళ్లే దారులకు ఇరువైపులా ముళ్ల చెట్లు వున్నాయని వాటిని ఉపాధి హామీ పథకం కింద కంపచెట్లు తొలగించాలన్నారు. మెయిన్‌రోడ్డులో సైడ్‌కాలువ పూడికతీయకపోవడంతో మురుగునీరు నిలబడుతోందని చిన్నపాటి వర్షం వచ్చినా మురుగునీరు గుడి ప్రాంతంలో నిలుస్తోందని ఆ నీటిలో నుండి గుడిలోకి వెళుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల మండల అధ్యక్షులు ఓబుళపతి, సిపిఐ నాయకులు బాలకొండయ్య, బలరాముడు, ఆదెన్న, ఎర్రగుండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త



వేడుకలో పాల్గొన్న రమేష్‌రెడ్డి

పట్టణంలోని కృష్ణాపురం రోడ్డు, ఆర్డీటి కాలనీ, రమేష్‌రెడ్డికాలనీలో మంగళవారం నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రమేష్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రి సీజ్



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

గుత్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

పట్టణంలోని తుర్కపల్లిరోడ్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లక్ష్మీ క్లినిక్ ప్రైవేట్ ఆసుపత్రిని మంగళవారం జిల్లా వైద్యాధికారి భ్రమరాంబ దేవి సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారి విచారణలో వచ్చిన సమాచారం మేరకు అధికారులు ఆసుపత్రిని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు త్యాగరాజు, ఎల్లా రాముడు, డాక్టర్ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు




అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కరస్పాండెంట్ ఖలీమ్ బాషా

కదిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మాజీ రాష్ట్రపతి భారతరత్న అవార్డు గ్రహీత, ఏపిజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం స్థానిక శ్రీశాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ గురుబ్రహ్మ అవార్డు గ్రహీత మోమిన్ సలీమ్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి డా.ఏపిజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. ఏపిజే అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలు నిర్వహజించుకోవడం సంతోషకరమన్నారు. అబ్దుల్ కలాం శాస్త్ర సాంకేతిక రంగాలలో దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసి భారత రక్షణ రంగం బలోపేతానికి కృషి చేసిన ఆధునిక పితామహుడు, నిడారంబరుడు, మిస్సెల్‌మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు గాంచిన వ్యక్తి అబ్దుల్ కలాం అన్నారు. అబ్దుల్ కలాం యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని కలలు కనడమే కాదు అవి సాకారం చేసుకోవాలని అని యువతకు వివరించారన్నారు. మన జననం, సాధారణమైనది కావచ్చు కానీ, మరణం ఒక చరిత్ర సృష్టించాలని చెప్పిన మహనీయుడు ఏపిజే అన్నారు. నేటి యువత ఆయన అడుగు జాడల్లో నడిచి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చిత్రావతి నది వద్ద రైతుల ఆందోళన

యల్లనూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలోని చిలమకూరు వద్ద ప్రభుత్వం ఇసుక రీచ్ నడపాలని ర్యాంపు చేస్తుండగా చిలమకూరు రైతులు అక్కడికి చేరుకుని ఇక్కడ రీచ్ నిర్వహించకూడదని అడ్డుకున్నారు. చిత్రావతి నది చుట్టుపక్కల మాకు భూములు వున్నాయని ఇక్కడ ఇసుక తరలిస్తే బోర్లలో నీరు లేకుండా అడుగంటిపోతాయన్నారు. విషయం తెలుసుకున్న మైనింగ్ డిడి వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడుతూ మీ సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకళతామన్నారు. దీంతో సమస్య సద్దుమనిగింది.

## జూదరులు అరెస్ట్

యల్లనూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామ శివారులో జూదమాడుతున్న వారిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీరాంప్రసాద్ తెలిపారు. జూదమాడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి జూదమాడుతున్న మహేష్, శేఖర్‌తో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 34.450 రూపాయలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బాలేపల్లి తాండాలో పల్లె పండుగ కార్యక్రమం



బాలేపల్లి తాండాలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించిన ఎంపిడిఓ రఘునాథ్‌గుప్తా

నల్లచెరువు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

మండల పరిధిలోని బాలేపల్లి తాండా గ్రామ పంచాయితీలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ చొరవతో బాలేపల్లి తాండ నందు పల్లె పండుగ కార్యక్రమాన్ని ఎంపిడిఓ రఘునాథ్ గుప్తా, సర్పంచ్ సోనాలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. రూ.10లక్షల వ్యయంతో బాలేపల్లి ఎగువ తాండ బిటిరోడ్డు మరియు సీసీ రోడ్డు నిర్మాణం కల్వర్టులు పనులకు భూమిపూజ చేశారు. ఈ పనులు ఉపాధి హామీ పథకం నిధులు మరియు అంచనా మొత్తం రూ.10లక్షల తో పనులు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, విస్తరణ అధికారి శకుంతల, పంచాయితీ కార్యదర్శులు ఆనంద్, నరసింహులు, ఎన్ఆర్‌జిఎస్ బాలునాయక్, టిఏ జహీర్, ఎఫ్. గంగరాజు నాయక్, మరియు సచివాలయ సిబ్బంది, తెదేపా సీనియర్ నాయకులు సోమ్లానాయక్, బాలాజీ నాయక్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



సచివాలయం సిబ్బందికి ఆకస్మిక తనిఖీ చేసిన డిఎల్‌డిఓ పోలప్ప

నల్లచెరువు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని సచివాలయం–2నందు డిఎల్‌డిఓ పోలప్ప, ఎంపిడిఓ రఘునాథ్ గుప్తాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బంది విధులకు దుమ్మా కొట్టడంపై డిఎల్‌డిఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూమెంట్ రిజిస్టర్‌లో సరైన వివరాలు తెలపకపోవడం పట్ల ఇదేమిటని పంచాయితీ కార్యదర్శిని ప్రశ్నించారు. ట్రాన్స్కొ, వెల్ఫేర్, ఆగ్రికల్చర్, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేకపోవడం పట్ల డిఎల్‌డిఓ మండి పడ్డారు. ఇది మళ్ళీ పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించే పరిస్థితి లేదని ఈ సందర్భంగా డిఎల్‌డిఓ స్పష్టం చేశారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమం



గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిహెచ్‌ఓ రామచంద్రారెడ్డి

నల్లచెరువు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

మండలంలోని ఒరువాయి సచివాలయం పరిధిలోని బోయపల్లి గ్రామంలో పిహెచ్‌సి, సిహెచ్ఓ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ మరియు ఎంపిడిఓ సూచనల మేరకు అధికార వర్షపాతంపై వచ్చే అనారోగ్య సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో బోయపల్లి గ్రామంలో గర్భవతులు, బాలింతలు, చిన్న పిల్లలు ఇతర జబ్బులు ఉన్న వయసైన పెద్దవారికి అందరూ వేడి చేసిన చలార్చిన నీటిని తాగాలని బయట తినుబండారాలు తినకూడదని, చిన్న పిల్లలను రాత్రి సమయంలో బయలు ప్రదేశానికి పంపకూడదని, వేడి వేడి ఆహారాన్ని తీసుకోవాలని, ఇంటిలో వారానికి మంచి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమ కాటుకు గురికాకుండా చూసుకోవాలని, రైతులు పొలాలకు వెళ్లినప్పుడు విషపురుగులు కాటుకు ఉగరికాకుండా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఏవైనా వాంతులు, విరోచనాలు, లేదా వైరల్ జరములు గ్రామంలో వచ్చిన వెంటనే ఆశా వర్కర్ ద్వారా పిహెచ్‌సికి సమాచారం అందించిన వెంటనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

ఏవైనా గర్భవతులు తమ యొక్క డెలివరీ టైం అతి దగ్గరగా ఉన్నప్పుడు పిహెచ్‌సికి తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ లేదా 108కి ఫోన్ చేసి పిహెచ్‌సికి ముందస్తుగా రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, పిహెచ్‌సి ఇతర సిబ్బంది, ఎఎన్ఎం రోజా, ఎంఎల్‌హెచ్‌పి తస్లీమ్, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, ఆశా కార్యకర్త రమణమ్మ, గ్రామంలో గర్భవతులు,బాలింతలు, పిల్లలు వయసైన పెద్ద వారు పాల్గొన్నారు.

## కే.పూలకుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ భారతి

నల్లచెరువు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

మండల పరిధిలోని కే.పూలకుంట గ్రామం నందు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి ఏఓ భారతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధికారులు రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొని ఈ సందర్భంగా రైతులకు అధిక వర్షాల వలన వరి పంటలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పొలంలో నీరు అధికంగా ఉంటే గట్లను తెంపాలని, అలాగే వర్షాలు ఉన్నప్పుడు కోతలు చేయకుండదని, వరిలో జింక్ బోరాన్‌తో పాటు మందులు పిచికారి చేసుకోవాలని, వరిలో కలుపు నివారణ చేసుకోవాలని, కాంప్లెక్స్ ఎరువులు పై పాటుగా వేయకూడదని, వేరుశెనగలో రవిలో విత్తన శుద్ధి ఇమి డాక్లోఫిడ్ ఫైథాన్ ఎం.45తో చేయాలని సూచించారు. వేరుశెనగలు జిప్సం 200కేజీలు, పూత దశలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ డ్రిప్ పసుసమ్మర్ధక శాఖకు సంబంధించిన వివరాలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కెహెచ్‌ఏ దశరథ్‌నాయక్, విఏఏ సాధిక్‌వలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గొర్రెల అపహరణ కేసులో నలుగురు అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ, ఎస్సై

ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 15, ప్రభాతవార్త

మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామం రంగయ్యానాయుడు చెందిన పది గొర్రెలు దొంగతనం అయిన కేసులో సబ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరెడ్డి మరియు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి స్వల్ప కాలంలోనే నలుగురు దొంగలను అరెస్ట్ చేసినట్లు సిఐ నరేంద్రారెడ్డి వెల్లడించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో సిఐ నరేంద్రారెడ్డి, ఎస్సై మల్లికార్జునరెడ్డిలుకేసు పూర్వాపరాలను వివరించారు. ఈ రోజు మంగళవారం గొర్రెలు కదిరికి ఆటోలో వెళుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సైమల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో మల్లాపల్లి వద్ద కదిరి–హిందూపురం రహదారిపై వాహనలు తనిఖీలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో బండి శశికుమార్, పాలపర్తి వెంకటేశ్వర్లు, పులి వరప్రసాద్, కోనేటి పాల్‌రాజు అను వ్యక్తులను ఓ ఆటలో గొర్రెలు తీసుకువెళుతుండడాన్ని గుర్తించి కూపీ లాగడంతో అసలు విషం బహిర్గతం అయిందన్నారు. విచారంచిగా మిట్టపల్లిలో రంగయ్యానాయుడు గొర్రెలను తామే దొంగలించినట్లు అంగీకరించారన్నారు. నలుగురిని అరెస్ట్ చేసి పది గొర్రెలతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. బండి శశికుమార్, పాలపర్తి వెంకటేశ్వర్లు ఇద్దరు బాపట్ల పట్టణంలో చిన్ననాటి స్నేహితులు. బండి శశికుమార్ మిట్టపల్లికి చెందిన నాగులమ్మ పెద్ద కూతురును పెళ్లి చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. మరో ముద్దాయి నాగులమ్మ చిన్న అల్లుడు కోనేటి పాల్‌రాజ్ రెండు నెలల క్రితం చీరాల నుండి మిట్టపల్లికి వచ్చి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మరో ముద్దాయి నాగులమ్మ కొడుకు వరప్రసాద్ వీరందరూ మద్యం సేవించేందుకు డబ్బు లేకపోవడంతో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారన్నారు. ఈ క్రమంలో 12వ తేదీన రంగయ్యానాయుడు గొర్రెల మందలోని 10 గొర్రెలను గుట్టచప్పుడు కాకుండా అపహరించుకువెళ్లారన్నారు. బండి శశికుమార్, పాలపర్తి వెంకటేశ్వర్లుపై బాపట్లలో ఇదివరకే కేసులు నమోదయ్యాయన్నారు. ముద్దాయిలను కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించనున్నట్లు సిఐ స్పష్టం చేశారు. త్వరితగతిన కేసును చేదించి బాధితులకు అండగా నిలిచిన ఎస్సై మల్లికార్జునరెడ్డి మరియు సిబ్బందిని సిఐ నరేంద్రారెడ్డి అభినందించారు.

### అసాంఘిక చర్యలు చేపడితే తప్పవు కఠిన చర్యలు

మండలంలో ఎవరైనా అసాంఘిక చర్యలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సిఐ నరేంద్రారెడ్డి, ఎస్సై మల్లికార్జునరెడ్డిలు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల కాలంలో యువత మత్తుకు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారంలోకి తీసుకువెళుతున్నారు ఇది సమాజానికి మంచి కాదన్నారు. మత్తులో తాము ఎమి చేస్తున్నామో తెలియక ఇటు తల్లిదండ్రులను అటు సమాజాన్ని బయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇది ఎంత మాత్రం క్షమార్హితం కాదన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, చీటింగ్‌లు చేసే వారు ఎంతటివారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

## అధికారులకు శుభాకాంక్షల వెల్లువ

ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 15, ప్రభాతవార్త



ఎస్సైకు శుబాకాంక్షలు తెలియచేస్తున్న నాయకులు

ఇటీవల మండలంలో బాధ్యతలు చేపట్టిన ఎంపిడీఓ రాబర్ట్ విల స్‌న్, సబ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరెడ్డి, పంచాయితీ పర్యవేక్షణాధికారి కేశవరెడ్డి, డిప్యూటి తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ పద్మనాభరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసాచారితో పాటు పలువురు పంచాయితీ కార్యదర్శులకు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు వెల్లువలా కురిపిస్తున్నారు. మంగళవారం వారి కార్యాలయాలకు వెళ్లి శాలువలు, పూలమాలలు వేసి సత్కరించారు. డబురువారిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సోమగుట్ట ఆనంద్‌రెడ్డి, బూత్ కన్వీనర్ విజయక్‌కుమార్, డ్రైవర్ జయచంద్ర, టైలర్ శ్రీరాములు, అల్లాపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, నాయకులు రాజగోపాల్, శివనారాయణ, ఎఫ్ఏ పూజారి రమణ, పూజారి సుధాకర్, మావిటి రాజేష్, సోమశేఖర్, గౌడ్ నాగరాజు, నరసింహులు, మధు, కర్ణ, వెంకటస్వామి, గంగన్న, మీసేవ సుధాకర్, సత్యకుమార్, ప్రభాకర్‌లు కలసి శుభాకాంక్షలు తెలియచేశారు.

## పాడి,పశువుల రైతులు వర్ష సూచనలు పాటించండి

తలుపుల,అక్టోబర్15,ప్రభాతవార్త



నారాయణస్వామి

వాతావరణశాఖ ఆదేశాల మేరకు రాబోయే రెండు రోజులు అధిక వర్షాలు కురుస్తాయని తెలియ చేయడం జరిగిందని మండల పశు వైద్యాధికారి నారాయణస్వామి తెలిపారు. పాడి,పశువుల రైతులు ఈ రెండు రోజులు తమ పశువులు గొర్రెలు,మేకలు,పాడి పశువులను వంకలు,వాగుల వద్దకు మేతకు తోలుకెళ్ళరాదన్నారు. అదే విదంగా వర్షం పడే సమయంలో చెట్ల క్రింద తోలరాదన్నారు. పాత మిద్దెలలో,పాత కొట్టాలలో కట్టేయకుండా జాగ్రత పడాలన్నారు.అలా కట్టివేస్తే కూలిపోయే ప్రమాదాలు జరగవచ్చు కాబట్టి కట్టివేయరాదని తెలిపారు.కరెంట్ వైర్లకు,కరెంట్ స్థంభాలకు దూరంగా ఉండటం వలన ప్రమాదాలు జరగకుండా నివారించుకోచ్చని తెలిపారు.పాడి రైతులు ఈ సూచనలు తప్పక పాటించాలన్నారు.

## విద్యుత్‌శాఖ ఏడి రఘుకు వీడ్కోలు



ఏడిని సన్మానించిన దృశ్యం

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త

తాడిపత్రి నియోజకవర్గంలో విద్యుత్‌శాఖ ఏడిగా విధులు నిర్వహిస్తున్న వి.రఘు బదిలీల్లో భాగంగా తిరుపతి కార్పోరేట్ కార్యాలయానికి బదిలీపై వెళుతున్న సందర్భంగా వీడ్కోలు సభ కార్యక్రమాన్ని స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడి రఘును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుత్తి డివిజన్ ఈఈ రాజశేఖర్, ఏఏఇ నరసయ్య, ఏఇలు వీరాంజనేయరెడ్డి రాజారావు, శ్రీనివాస్‌రెడ్డి, దినేష్, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పావురాల శీనయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్లు, జెఎల్‌ఎంలు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, కాంట్రాక్టర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్వ్యూలు వాయిదా

యల్లనూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త

బుధవారం జరగాల్సిన అంగన్‌వాడి ఉద్యోగుల ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు ఐసిడిఎస్ సిడిపిఒ భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యల్లనూరు. పుట్లూరు. నార్పల మండలాల అంగన్‌వాడి ఉద్యోగుల ఇంటర్వ్యూలను వాయిదా వేయడం జరిగిందన్నారు. తిరిగి ఇంటర్వ్యూలను ఈ నెల 23వ తేదీ బుధవారం నిర్వహించడం జరుగుతుందని సిడిపిఒ తెలిపారు.

## ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం



అగళి, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండల పరిధిలోని మధూడిలో వెలసిన పురాతన వీరభద్రస్వామి రథోత్సవం మంగళవారం రోజు వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి స్వామి అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవం వేళ స్వామిని వివిధ రకాలపూలతో విద్యుత్‌దీపాలతో వివిధ రకాల ఆభరణాలతో అలంకరించారు. దేవాలయం మొత్తం విద్యుత్ దీపాలతో వెలిగింది. వీరభద్రస్వామి రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరు అవుతారు. వీరభద్రస్వామి దేవాలయం చుట్టూ రెండు, ఐదు కెజిలప్రకారం నూనెవేసి కాగడాలనువెలిగించడం పురాతనమైన ఆచారం.కాగడాలువెలిగిస్తే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. కాగడాలు వెలిగించిన అనంతరం వీరభద్రస్వామి రథాన్ని చూడ ముచ్చటగా అలంకరించారు. వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచారు. రథంపై ఉంచిన అనంతరం 12 కైవాడస్తులు, యజమాని, ఆలయ మండలి వారు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించిన అనంతరం రథాన్ని లాగడం మొదలు పెట్టారు. భక్తులు పోటీపడి వీరభద్రస్వామి రథాన్ని లాగారు. రథంపై పూలమాలలను వేస్తే అనుకున్నది జరుగుతుందని, ఐశ్వర్యం సిద్దిస్తుందని, దీర్ఘకాలిక రోగాలు నయం అవుతాయని, వివాహాలు కాని వారికి వివాహాలు జరుగుతాయని భక్తుల విశ్వాసం. రథోత్సవంలో అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ మండలి వారు భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.ఎస్ఐ వీరేష్, ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

## మధూడిలో పొలం పిలుస్తోంది..

అగళి, అక్టోబర్ 15 ప్రభాతవార్త



కార్యక్రమానికి హాజరైన రైతులు

మధూడి రైతు సేవా కేంద్రంతో పాటు, మధూడి వ్యవసాయ పొలి మేరలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఓ శేఖర్‌నాయక్ హాజరై రైతుల పొలాలకు వెళ్లి మాట్లాడటంతోపాటు సేవా కేంద్రంలో రైతులకు సలహాలు,సూచనలు ఇచ్చారు. మూడు, నాలుగు రోజులపాటు వర్షాలు అధికంగా కురుస్తాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాల సమయంలో కోతకు వచ్చిన పంటను కోయరాదని, అలాగే కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయానికి రైతులు మగ్గుచూపాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సేంద్రీయ ఎరువులను వాడాలని దీని వల్ల దిగుబడి బాగా పెరుగుతుందన్నారు. జడ్పిఎన్ఎఫ్ ద్వారా రెండు యూనిట్లను ఇనగలూరు, మధూడిలో ఉన్నట్లు తెలిపారు. పశు సంవర్ధకవారు పశువుల భీమా గురించి వివరించారు.

## ఘనంగా పల్లె పండుగ కార్యక్రమం



పల్లె పండుగ నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండల పరిధి లోని మోరుబాగలు గ్రామపంచాయితీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండు గ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీలో మంజూరైన సిమెంట్ రోడ్లను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు తిప్పేస్వామి, పురుషోత్తం, రాజేంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గోకులం షెడ్లు, సిమెంట్ రోడ్లు, పంట కాలువల పునరుద్దరణ తదితర కార్యక్రమాలలో గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాజన్న, ఈసీ లక్ష్మానాయక్, టెక్నికల్ అసిస్టెంట్ కాచికుంట వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్, నాచేపల్లి గంగాధర్, వైస్ హనుమంతరాయప్ప, కృష్ణమూర్తి, సన్న లింగప్ప, రామప్ప, సుదర్శన్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు

గుడిబండ, అక్టోబర్ 15 ప్రభాతవార్త



అద్వానంగా ఉన్న రోడ్డు

మండలపరిధిలోని ఎంఎస్ తాండ నుంచి వడ్డెరహట్టి, పిఎన్ పాళ్యం మీదుగా మండల కేంద్రానికివెళ్లే రోడ్డు మార్గంచాలా అధ్వానంగా తయారైంది. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు ఉమేష్ రోడ్డును సందర్శించి మాట్లాడుతూ.. కనీసం ద్విచక్ర వాహనం, ఆటోలు కూడా వెళ్లలేని విధంగా రోడ్డుఉందని మూడు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లందుకు విద్యార్థులు, రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని గత వైకాపా ప్రభుత్వంలో రోడ్ల మరమ్మ త్తులు చేపట్టలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి, మరమ్మత్తులు పెద్దపీట వేస్తోందని కావున ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే రాజు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్యను పరిష్కరించడానికి చొరవ తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివన్ రంగప్ప, సిద్దేశప్ప, చంద్రప్ప, పిఆర్ కిష్టప్ప, పుట్టన్న, కాటప్ప, రంగనాథ్, చంద్రశేఖర్, శివకుమార్, పవన్ అనిల్‌కుమార్, దిలీప్‌కుమార్, చిరంజీవి, విష్ణుకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పల్లె పండుగ వారోత్సవాలు

మడకశిర అక్టోబర్ 15 ప్రభాతవార్త;



సిసి రోడ్డుకు భూమి పూజ చేస్తున్న తేదేపా నాయకులు

మడకశిర శాసన సభ్యులు ఎంఎస్. రాజు, మాజీ శాసన మండలి సభ్యులు గుండుమల తిప్పే స్వామి ఆదేశాల మేరకు మంగళవారం ఛత్రం గ్రామ పంచాయితీ సి.రంగాపురం మరియు ఆర్.అనంతపురం లో పల్లె పండుగ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా సిసి.రోడ్లకు భూమి చేశారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిటీసి రంగేగౌడ్, క్లస్టర్ ఇంఛార్జ్ నాగరాజు, నరేష్ కన్న, శ్రీనివాస్, నాగేంద్ర, రామాంజినేయులు, పాలరామాంజి, డ్రైవర్ రామాంజి, మాజీ సర్పంచ్ పాండురాజు, మాజీ ఎంపిటీసి నంజుండ, నాగేగౌడు, కమలాకర్, సచివాలయ సిబ్బంది నాగన్న, నాగరాజు, రాధాదేవి, తిప్పేస్వామి, శ్రీకాంత్‌గౌడ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల టెండర్లలో కూటమి ఎమ్మెల్యేలు, నాయకుల దౌర్జన్యాలు

- టీడీపీ ఎమ్మెల్యేలు తమకు 15 నుంచి 20శాతం వాటా ఇవ్వాలని బెదిరించారు - విలేఖరులతో అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి

ఉరవకొండ, అక్టోబర్ 15 ప్రభాతవార్త




విలేఖరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి

జిల్లాలో మద్యం దుకాణాల టెండర్లలో కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు దౌర్జన్యాలు చేశారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యేలు బహిరంగానే తమకు 15 నుంచి 20శాతం వాటా, కమీషన్లు ఇవ్వాలని బెదిరింపులకు దిగారని వాపోయారు. ఈ విషయమై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో కథనాలు వచ్చినా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారిని అదుపు చేయలేదని, ప్రశ్నిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నోరు మెదపలేదని ఎద్దేవా చేశారు. ఒకవైపు పీఏబీఆర్‌లో తాగునీటి సరఫరా కార్మికులు కొన్ని నెలలుగా జీతాలు, ఇతరత్రా సమస్యల పరిష్కారం కోసం సమ్మె, ఆందోళనలు చేస్తున్నా, తత్ఫలితంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజలు తాగునీటి కష్టాలు అనుభవిస్తున్నా నోరు మెదపని స్థానిక ఎమ్మెల్యేలు మద్యం టెండర్ల ద్వారా సంపాదనలపై మాత్రం దృష్టి పెట్టారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీతో పంపిణీ చేస్తున్న పప్పుశెనగ ధరకు బహిరంగ మార్కెట్ ధరకు ఎటువంటి తేడా లేదన్నారు. ప్రభుత్వం క్వింటాల్ 7,050 రూపాయలకు ఇస్తుండగా బహిరంగ మార్కెట్‌లో అదే ధరకు నాణ్యమైన విత్తనం అభిస్తోందన్నారు. హంద్రీనీవా కాలువ పెండింగ్ పనులు పూర్తిపై ప్రభుత్వం దృష్టి పెట్టడంలేదని దీంతో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారుతుండగా రైతులు కిలోమీటర్లు పైపులు వేసుకొని, మోటార్లు పెట్టుకొని నీటిని పంపింగ్ చేసుకోవాల్సి వస్తోందన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి రాయలసీమలో 6.3 లక్షల ఎకరాలకు నీటిని అందించి సస్యశామలం చేయాలన్న లక్ష్యంతో హంద్రీనీవాను చేపట్టి 90శాతం పనులు పూర్తి చేశారన్నారు. అయితే ఆ తరువాత వచ్చిన వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం ప్రభుత్వాలు పెండింగ్ పనుల పూర్తిపై దృష్టి పెట్టకపోగా ఇప్పుడొచ్చిన కూటమి ప్రభుత్వం సైతం అదే బాటలో నడుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం డిస్ట్రిబ్యూటరీ, పిల్ల కాలువల వ్యవస్థపై దృష్టి పెట్టకపోతే కమ్యూనిస్టు పార్టీలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమ వాసి అయినప్పటికీ ఇక్కడి సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో అనంతపురం జిల్లాకు కేటాయించిన ఎయిమ్స్, కర్నూల్ జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న హైకోర్టు, రాయలసీమ వర్సిటీ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కడప జిల్లాలోని కోపర్తిలో ప్రారంభించిన ఇండస్ట్రియల్ పార్కును అమరావతికు తరలించడం సీమకు తీరని ద్రోహం చేసినట్లేనన్నారు. సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో అత్తా, కోడళిపై సామూహిక అత్యాచారం దారుణమని ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని వై.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## శిథిలమైన ఎంపీపీ ఉర్దూ పాఠశాల..!

- భారీ వర్షాలకు పైకప్పు కూలిపోయే అవకాశం
- ఏళ్ళు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని దైన్యం


ఉరవకొండ, అక్టోబర్ 15 ప్రభాతవార్త



పాఠశాల పైకప్పు సిమెంటు పెచ్చులూడిపడి ఇనుప కడ్డీలు కనిపిస్తున్న దృశ్యం



పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న డెస్కులు




పాఠశాల గోడ పాచిబట్టి మొక్కలు మొలచిన దృశ్యం

పట్టణంలోని 6వ వార్డులోగల మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల పైకప్పు మొత్తం ధ్వంసమై సిమెంటు పెచ్చులూడిపడి ఇనుప కడ్డీలు దర్శనమిస్తున్నాయి. గోడలు పాచిపట్టి అందులోంచి మొక్కలు మొలవడం విశేషంగా చెప్పాలి. గత ప్రభుత్వం నాడు-నేడు మనబడి కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దింది. అయితే ఉర్దూ పాఠశాల అభివృద్ధిపై మాత్రం దృష్టి కేంద్రీకరించకపోవడంతో పాఠశాల పరిస్థితి దయనీయంగా మారింది. పాఠశాలలో ప్రస్తుతం 24 మంది విద్యార్థులు ఉండగా భారీ వర్షాలు కురిస్తే పాఠశాల పైకప్పు కూలిపోయే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈనెల 16, 17 తేదీల్లో అనంతపురం జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో ఈ పాఠశాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఊహించని ప్రమాదం జరుగకముందే అధికారులు స్పందించి పాఠశాలను మరో చోటికి మార్చాల్సి ఉంది. వర్షాలు తగ్గిన తరువాత పాఠశాలకు కనీస మరమ్మతులు చేయించి విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

## చేతులను శుభ్రపరుచుకుందాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

గుంతకల్లు, అక్టోబర్ 15 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహమ్మద్

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమీషనర్ నయీమ్‌అహమ్మద్ అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్బంగా మంగళవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో వార్డు మహిళా సంఘాల వారికి ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రత, మన ఆరోగ్యం మన బాధ్యత అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఒ మోహన్, మెప్మా సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా జీవించాలి - ఎస్ఐ

గుత్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త



ఎస్ఐ సురేష్ మాట్లాడుతున్న దృశ్యం

ప్రజలు క్షక్షలు, కార్పణ్యాలు వీడి శాంతియుతంగా జీవించాలని అర్బన్ ఎస్ఐ సురేష్ సూచించారు. మంగళవారం సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆయనతో పాటు సిబ్బందితో కలిసి మండలంలో కొత్తపల్లి గ్రామంలో నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమానిత ఇళ్లను సోదాలు చేశారు. తదుపరి రికార్డులు లేని ఆరు మోటర్‌సైకిళ్లు, రెండు ఆటోలను సీజ్ చేశారు.

## పోలీసుస్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పి

గుంతకల్లు, అక్టోబర్ 15 ప్రభాతవార్త



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పి జగదీష్

పట్టణంలోని రూరల్, పట్టణ పోలీసుస్టేషన్లను జిల్లా ఎస్పి జగదీష్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా స్టేషన్ల పరిసరాలతో పాటు లాకప్ గదులు, రిసెప్షన్ కౌంటర్, రికార్డులను పరిశీలించారు. ఆయా స్టేషన్లలో ఎలాంటి నేరాలు నమోదవుతున్నాయో వాటి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సిఐలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా స్టేషన్ల పరిధిలో నమోదైన ప్రధాన కేసులు, పాత గ్రేవ్ ఎక్సైజ్ కేసులపై సమీక్షించారు. అలాగే రాత్రి గస్తీకి ప్రాధాన్యత ఇవ్వాలని సమర్థవంతమైన నేర నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిసి కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా వుంచాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పి వెంట గుంతకల్లు డిఎస్పి శ్రీనివాస్, సిఐలు ప్రవీణ్‌కుమార్, మనోహార్, మస్తాన్, సిబ్బంది వున్నారు.

## నేషనల్ జ్యూరీ రౌండ్‌కు గంధం ధీరజ్

-సర్కార్ స్టూడెంట్‌కు దక్కిన అరుదైన అవకాశం

గోరంట్ల, అక్టోబర్ 15 ప్రభాతవార్త



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థి

జాతీయస్థాయి డిజైన్, కోడింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జ్యూరీ రౌండ్‌కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి గంధం ధీరజ్ ఎంపికయ్యారు. ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో జ్యూరీ రౌండ్‌కు గంధం ధీరజ్ అర్హత సాధించాడు. ఐసిటి 360 ద్వారా గత 10సంవత్సరాల నుండి నిర్వహించబడుతున్న భారతదేశపు అతిపెద్ద డిజైన్ కోడింగ్ ఛాంపియన్‌షిప్‌ను యాప్ డిజైన్, గేమ్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, 3డి డిజైన్, మూవీ మేకింగ్, వెబ్ డిజైన్, కోడింగ్ విభాగాల్లో నిర్వహిస్తామని ఇందులో భారతదేశ విద్యార్థులతో పాటు సౌదీఅరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని విద్యార్థులు సైతం ఇందులో పాల్గొంటారన్నారు. ఈ పోటీలు పూర్తిగా ఆన్‌లైన్ విధానం ద్వారా జరుగుతాయని, ముందుగా నిర్వాహకులు ప్రకటించిన థీమ్‌కు అనుగుణంగా ప్రాజెక్ట్ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. ఈ విధంగా ప్రాంతాల వారిగా వచ్చిన ప్రాజెక్టలను పరిశీలించి అత్యుత్తమైన ప్రాజెక్టులను ప్రాంతాల వారిగా తరువాత దశ అయిన జ్యూరీ రౌండ్‌కు ఎంపిక చేస్తారు. ఈ దశలో జాతీయ స్థాయిలో జరిగే ఫైనల్ కోసం అత్యుత్తమ ప్రాజెక్టలను ఎంపిక చేస్తారని తెలిపారు. ధీరజ్ తయారు చేసిన ప్రాజెక్ట్ ఈ జ్యూరీ రౌండ్‌కు ఎంపికైంది. ఈ రౌండ్‌లో జ్యూరీ సభ్యులతో జూమ్ మీటింగ్‌లో ఈ నెల 21న జరిగే సమావేశంలో ధీరజ్ తయారు చేసిన ప్రాజెక్ట్ గురించి జ్యూరీ సభ్యులకు వివరించడం జరుగుతుందని విద్యార్థి తండ్రి గంధం శ్రీధర్ తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు మృతి

గోరంట్ల, అక్టోబర్ 15 ప్రభాతవార్త



మృతి చెందిన వృద్ధురాలు

గోరంట్ల పట్టణ సమీపంలోని రావికుంట చెరువులో మతిస్థిమితంలేని బీబీజాన్ (80) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక సిఐ శేఖర్ తెలిపిన వివరాలు వున్నాయి. పట్టణంలోని జామియా మసీదు ప్రాంతానికి చెందిన బీబీజాన్ కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతూ వుండేదన్నారు. శనివారం నుండి కనిపించడంలేదని ఆఖరికి పట్టణ చివర వున్న రావికుంటచెరువులో శవమై కనిపించందని కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపినట్లు సిఐ తెలిపారు. అయితే మూడు రోజులకుపైగా శవం చెరువులో వుండడంతో శరీరం బాగా కుళ్లిపోయిందని స్థానిక పంచాయతీ కార్మికుల సహకారంతో శవాన్ని బయటకు తీశామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని స్థానిక ఎస్ఐ బాబు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా టిడిపి జిల్లా అధ్యక్షుని జన్మదిన వేడుకలు

గుత్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త



టిడిపి జిల్లా అధ్యక్షులు కేక్ కట్ చేస్తున్న దృశ్యం

పట్టణంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు గజమాలతో ఆయనను ఘనంగా సత్కరించి కేక్ కట్ చేయించారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ, తెలుగుయువత మండల కన్వీనర్ సుధాకర్‌నాయుడు, మాజీ చైర్మన్ గౌస్‌పీర, మాజీ మార్కెట్‌యార్డుచైర్మన్లు ప్రభాకర్‌చౌదరి, బండారు ఆనంద్, టిడిపి డాక్టర్ సెల్ విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు, సంజీవరాయుడు, బోర్‌వెల్ నాగరాజు, మాజీ అధ్యక్షులు నరేంద్రచౌదరి, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, పత్రికా విలేకరులు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించుకోవాలి - డిఎంఇ ప్రమోద్

గుత్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త



సీనియర్ డిఎంఇ మాట్లాడుతున్న దృశ్యం

నేటి సమాజంలో ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రతి మహిళ క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించుకోవాలని స్థానిక డీజిల్ షెడ్ సీనియర్ డిఎంఇ ప్రమోద్ సూచించారు. మంగళవారం షెడ్డులో మహిళా కార్మికులకు బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ శరీరంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ వెంకటేష్ వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ సంధ్య, హెడ్‌నర్స్ ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండుగ ద్వారా గ్రామాభివృద్ధి



పల్లె పండుగలో పాల్గొన్న దృశ్యం

అమరాపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త

మండలంలో ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమని టిడిపి మండల కన్వీనర్ గణేష్, మాజీ ఎంపిపి కృష్ణమూర్తిలు పేర్కొన్నారు. మండలంలోని కె.శివరం, పేలుబండ, రంగాపురం గ్రామాల్లో ఎంపిడిఒ రామారావు సమక్షంలో సిసి రోడ్లకు భూమిపూజ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శివరం పంచాయతీలో 30 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, ఏపిఒ జగదీష్, జెఇ జగదీష్, సీనియర్ టిడిపి నాయకులు మాజీ సర్పంచు ఈరన్న, మల్లికార్జున, టిడిపి పంచాయతీ కన్వీనర్ ప్రభాకర్, కార్యదర్శి నాగవేణి, టికె హెన్రీ అరుణ్‌కుమార్, సర్పంచు చిత్తన్న, టిడిపి నాయకులు గుజ్జారప్ప, నరేష్, సంతోష్, జె.మంజునాథ్, బూత్ కన్వీనర్ మల్లికార్జున, ఈశ్వరప్ప, వై.మంజునాథ్, రంగాపురం హనుమంతరాయ, సీతారాంన, మండల జనసేన యూత్ అధ్యక్షులు శివకుమార్, రత్నమ్మ, తిప్పమ్మ, తిమ్మక్క, నళినమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు మంజు, గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలదపల్లిలో సిసి రోడ్లకు భూమిపూజ

అమరాపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త



భూమిపూజ చేస్తున్న దృశ్యం

మండలంలోని ఆలదపల్లి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపిడిఒ రామారావు సమక్షంలో జెడ్‌పిటిసి స్వారక్క నరసింహమూర్తి, నియోజకవర్గం బిసి సెల్ ఉపాధ్యక్షులు మంజుతారక్, మాజీ సర్పంచు పాండురంగప్ప, సర్పంచు గిరిజమ్మ ఈరన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పంచాయతీలో 5 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, ఉపాధి హామీ ఎపిఒ జగదీష్, జెఇ జగదీష్, గ్రామ కార్యదర్శి మనోహర్‌శర్మ, టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతరాయప్ప, లావణ్య, మాజీ ఎంపిటిసి కెంచప్ప, మాజీ సర్పంచు చంద్రప్ప, గిరిరాజు, రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ ముద్దరాజు, నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

పెనుకొండ, అక్టోబర్ 15 ప్రభాతవార్త:



నివాళులర్పిస్తున్న బహు చైతన్య వేదిక సభ్యులు

పట్టణంలో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బహుచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుకొండలోని ఆర్టీసి బస్టాండు వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేడుకలలో బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో అగ్రభాగాన నిలిపి ప్రపంచానికి తన ఘనత చూపించి భారతదేశ గౌరవాన్ని పెంచిన మహనీయుడు కలాం అని, పేద ఇంటిలో పుట్టిన కూడా, కష్టపడితే సాధించలేనిది ఏది లేదంటూ నిరూపించి, ఓ శాస్త్ర వేత్తగా, ఓ రాష్ట్రపతిగా ఉన్నత స్థాయికి ఎదిగి అందరికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ప్రతి విద్యార్థి ఓ అబ్దుల్ కలాం అవ్వాలని, ప్రతి యువత అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక గౌరవ అధ్యక్షులు వెంకటేష్, గౌరవ సలహాదారులు రొద్దం బాబు, ప్రసాద్, బ్రహ్మణపల్లి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షుడు చల్లాపల్లి ఈశ్వర్, రాంపురం రామాంజినేయులు, కోశాధికారి శెట్టిపల్లి నరసింహులు, కోఆర్డినేటర్, గౌరవ సభ్యులు హంద్రోస్, కోనాపురం మారుతి, కోనాపురం ఆంజిలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా 'పల్లె పండుగ'

- రూ.12 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ, అక్టోబర్ 15 ప్రభాతవార్త



చిన్నముష్టూరు గ్రామంలో పల్లె పండుగలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం


మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు నెట్టెం రాంబాబు, ఎంపీడీఓ బి.వి.రవి ప్రసాద్‌తో కలిసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు 12 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నెట్టెం రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాన్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏ.వి.రమణకుమార్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఓను కలుసుకున్న తెదేపా నేతలు

ఆర్‌డిఓకు పూలమొక్కను అందిస్తున్న తెదేపా నాయకులు

పుట్టపర్తి, అక్టోబర్ 15, ప్రభాతవార్త

ఇటీవల పుట్టపర్తి ఆర్‌డిఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సువర్ణను పుట్టపర్తి తెదేపానాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్బంగా ఆమెకు పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆర్‌డిఓకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి కన్వీనర్ బి.రామాంజినేయులు, మాజీ పుడా ఛైర్మన్ కడియాల సుధాకర్, రాష్ట్ర ముస్లిం మైనారిటీవిభాగం కార్యదర్శి మహమ్మద్ రఫీ, అంబులెన్స్ రమేష్ తదితరులు ఆర్‌డిఓను కలుసుకున్న వారిలో ఉన్నారు.



ఆర్‌డిఓకు పూలమొక్కను అందిస్తున్న తెదేపా నాయకులు

09ATP27_09ATP27.qxd 15-10-2024 PM 10:32 Page 1






## కర్ణాటక మూడు అసెంబ్లీ సీట్ల ఉప ఎన్నికల తేదీ ప్రకటింపు

### - నవంబర్ 13న పోలింగ్ 23న రిజల్ట్

**బెంగళూరు,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**

లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక నుంచి ముగ్గురుఎంఎల్ఎలు ఎంపీలుగా గెలుపొందటంతో ఈ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు మంగళవారం ఉప ఎన్నికల తేదీని కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్‌కుమార్ ప్రకటించారు.చెన్నపట్టణ,సండూరు,శిగ్గావి మూడు అసెంబ్లీ సీట్లకు నవంబర్ 13న పోలింగ్ జరగనుంది.వీటిలో చెన్నపట్టణ సీటుకు కుమారస్వామి ,సండూరు సీటుకు ఈ.తుకారాం,శిగ్గావి సీటుకు బసవరాజ్ బొమ్మాయి రాజీనామా చేశారు.జెడిఎస్ కాంగ్రెస్,బిజెపి పార్టీల ముగ్గురు ఎంఎల్ఎలు ఆనాడు రాజీనామాచేయటంతో ఉప ఎన్నిక జరుగుతోంది.కాగా చెన్నపట్టణ సీటులో జెడిఎస్ పార్టీ తరపున నిఖిల్ కుమారస్వామి ఎన్డీయే అభ్యర్థిగా పోటీచేస్తారని కుమారస్వామి ప్రకటించటంతో ఈసీటుపై చాలా ఆశలుపెట్టుకున్న మాజీ మంత్రి బిజెపి నాయకుడు సిపి.యోగేశ్వర్ ఇపుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగనున్నారు.ఇందుకోసం బుధవారం చెన్నపట్టణలో ఆయన తన కేడర్ ఓటర్లు కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం.కాంగ్రెస్ పార్టీ ఈసీటును తప్పనిసరిగా గెలవాలన్న సంకల్పంతో ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ తానే ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానని ఇప్పటికే ప్రకటించారు.అయితే ఈయన పేరును కాంగ్రెస్ హైకమాండ్ కరారు చేయాల్సి ఉంది.సండూరు సీటును కాంగ్రెస్ మళ్లీ గెలుచుకునేందుకు ఇప్పటికే సిఎం అక్కడ సాధనసమావేశం నిర్వహించి ఉప ఎన్నికలకు శంఖారావం ఊదారు.బళ్లారి జిల్లాలో అందునా సండూరు సీటును దక్కించు కునేందుకు కాంగ్రెస్ పార్టీ తన సర్వశక్తులను ఇక్కడ ఒడ్డుతోంది.కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో కీలకజిల్లాగా ఉన్న బళ్లారి జిల్లా ఎంపీ సీటును తుకారాం గెలుచుకోవటంతో ఆయన స్థానంలో మరో బలమైన అభ్యర్థిని బరిలోనికి దింపాలని కాంగ్రెస్ పార్టీ అన్నికోణాల్లో పరీక్షలు జరిపి ఎంపిక చేయనుంది.ఇది వెంటనే జరిగితే ఈసీటు కాంగ్రెస్‌పాలవ్వటం ఖాయం.మధ్యకర్ణాటక ప్రాంతంలో హావేరి జిల్లా ఎంపీగా గెలిచిన శిగ్గావి ఎంఎల్ఏ బసవరాజ్ బొమ్మాయి స్థానంలో మరో అభ్యర్థిని పోటీకి దింపి బిజెపి ఈసీటును తనఖాతాలో వేసుకునేందుకు అన్ని అస్త్రాలను సిద్ధం చేసుకొంటుంది.మూడు పార్టీకు ఈ ఉప ఎన్నికలు ప్రతిష్టాత్మకంగానే ఉన్నాయి.గత మూడున్నర నెలలుగా కాంగ్రెస్ సర్కారును ఇరకాటంలో పెట్టడంలో విజయవంతమైన ఎన్డీయే పార్టీలు బిజెపి జెడిఎస్‌లు ఇపుడు సంయుక్తంగా ఉప ఎన్నికలను ఎదిరిస్తున్నాయి.వీరు సీట్ల సర్దుబాటు సక్రమంగా చేసుకుంటే విజయం సాధ్యపడుతుంది.చెన్నపట్టణలో బిజెపి నుంచి రెబల్ బెడద తప్పేటట్టు లేదు. సిపి.యోగేశ్వర్‌కు టిక్కెట్టు నిరాకరిస్తే ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేయటం ఖాయం.ఇప్పటికే ఈదిశలో యోగేశ్వర్ అడుగులు వేశారు.కాగా పై మూడు సీట్లకు ఈనెల 25నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది.28వ తేదీన నామినేషన్ల పరిశీలన,30వ తేదీన నామినేషన్ల ఉప సంహరణ నవంబర్ 13న పోలింగ్ నవంబర్ 23న ఎన్నికల ఫలితాల ప్రకటింపు జరుగుతుంది.మూడు సీట్ల ఎన్నికలకు కేవలం 28రోజుల్లోనే పూర్తవుతాయి.గతంలో కర్ణాటకలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి తలెత్తలేదు. ఉప ఎన్నికల తేదీల ప్రకటింపు నుంచి పోలింగ్ జరిగే తేదీలోపు కనీసం రెండునెలల వ్యవధి ఉంటే ఈసారి మహారాష్ట్ర జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికలు సాకుగా పెట్టిన కేంద్ర ఎన్నికల సంఘం 28రోజుల్లోనే ఉప ఎన్నికలను పూర్తిచేసేందుకు తేదీలను ప్రకటించింది.

## మహారాష్ట్ర విధానసభ ఎన్నికల పరిశీలకులుగా కర్ణాటక మంత్రులను నియమించిన కాంగ్రెస్ అధ్యక్షుడు




మంత్రులు జి.పరమేశ్వర, ఎంబి.పాటిల్

**బెంగళూరు,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటక పొరుగున ఉన్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించటంతో ఆరాష్ట్రంలో 288సీట్లకు జరిగే ఎన్నికల్లో జోన్లవారీగా కాంగ్రెస్‌అధిష్టానం మంగళవారం కర్ణాటకకు చెందిన ముగ్గురు నాయకులను ఎన్నికల పరిశీలకులుగా నియమించింది, సీనియర్ మంత్రులు డాక్టర్ జి.పరమేశ్వర,ఎంబి.పాటిల్ ,రాజ్యసభమెంబర్ నాసిర్‌హుసేన్ లను పరిశీలకులుగా ఏఐసిసి ప్రధానకార్యదర్శి కెసి.వేణుగోపాల్ నియమించారు. డాక్టర్ జి.పరమేశ్వర ముంబాయి,కొంకణ్ రీజియన్ పరిశీలకులుగా మరాఠ్వాడ ,పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతానికి మంత్రి ఎంబి.పాటిల్ పరిశీలకులుగా,దక్షిణ మహారాష్ట్రకు నాసిర్‌హుసేన్‌ను పరిశీలకుడిగా నియమించారు.మహారాష్ట్రకు నవంబర్ 18న పోలింగ్ జరగనుంది.23న ఫలితాలు ప్రకటిస్తారు.

## బెంగళూరులో భారీ వానలు నేడు శాలా కాలేజీలకు సెలవు

### - జిల్లా కలెక్టర్ ఆదేశాలు

**బెంగళూరు,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు పొరుగున ఉన్న చెన్నయ్‌లోని బంగాళాఖాతంలో లేచిన వాయుగుండం కారణంగా సిటి గత రాత్రి నుంచి భారీఎత్తున వానలు కురుస్తుండటంతో బెంగళూరు నగరజిల్లా కలెక్టర్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటన చేస్తూ సిటీలోని అన్ని పాఠశాలలు కాలేజీలు బుధవారం శలవు ప్రకటిస్తునట్లు చెప్పారు.వానల కారణంగా నగరంలోని లక్షలాది మంది విద్యార్థులుదూరప్రాంతాల్లోని స్కూళ్లు కాలేజీలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడతారని అంటూ విద్యాసంస్థలకు శలవు ప్రకటించారు.

## మహిళ రేప్‌కేసులో బిజెపి ఎంఎల్ఎకు బెయిల్ మంజూరు

**బెంగళూరు,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**

మహిళపైన రేప్ జరిపాడని కగ్గలిపుర స్టేషన్‌లో పోలీసులు పెట్టిన కేసులో అరెస్టు అయిన బెంగళూరు రాజరాజేశ్వరీ నగర బిజెపి ఎంఎల్ఎ మునిరత్నంనాయుడుకు మంగళవారం నగర ప్రజాప్రతినిధుల స్పెషల్‌కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.దీంతో గత నెలరోజులుగా బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న మునిరత్న బెయిల్‌పైన విడుదల కానున్నారు.బెంగళూరు నగర పాలికె నుంచి పెద్ద పెద్ద వర్కు టెండర్లు పొందటానికి పాలికె ఉన్నతాధికారులపైన హనీట్రాప్ జరిపాడన్న ఆరోపణలు ఈయనమీద ఉన్నాయి.ఇప్పటికే ఒక కేసులో బెయిల్ పొందిన మునిరత్న ఇవాళ మహిళా రేప్‌కేసులో జామీను పొందారు.

## ఈనెల 21న దక్షిణకన్నడ జిల్లా స్థానిక సంస్థల నుంచి విధానపరిషత్ సభ్యుడి ఎంపిక కోసం ఎన్నికలు

**మంగళూరు,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**

మంగళూరు జిల్లా స్థానిక సంస్థల నుంచి జరిగిన ఎంఎల్సీ ఎన్నికల్లో గతంలో గెలుపొందిన బిజెపి నాయకుడు కోటా శ్రీనివాసపూజారి ఇటావల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉడుపి చిక్కమగళూరు సీటునుంచి బిజెపి తరపున ఎంపీగా గెలవటంతో ఆయన ఎంఎల్సీ పదవీకి రాజీనామా చేశారు.ఈసీటుకు ఈనెల 21న పోలింగ్ జరుగుతుంది.ఇప్పటికే కాంగ్రెస్ బిజెపి పార్టీలు తమ అభ్యర్థులను పోటీకి నిలబెట్టారు.దక్షిణ కన్నడ జిల్లాలో నిరుడుజరిగిన విధానసభ ఎన్నికల్లో చాలాచోట్ల బిజెపి ఎంఎల్ఎలు గెలుపొందటంతో సహజంగానే ఈసీటు బిజెపి కైవశం అయ్యింది.అయితే ఈసారి రాజ్యంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలో ఉండటంతో చాలామటుకు స్థానిక సంస్థల సభ్యులు కాంగ్రెస్‌పట్ల అభిమానం చూపుతుండటంతో ఇక్కడ ఎంఎల్సీ సీటును కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని అంటున్నారు.ఇప్పటికే బిజెపి కాంగ్రెస్‌పార్టీలు నియోజకవర్గాలు వారుగా ఎన్నికలప్రచారం జరిపి తమ తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పక్కా వ్యూహం అమలుచేస్తున్నారు.బిజెపి నుంచి ఈసీటును గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అహింద అస్త్రాన్ని ( అల్పసంఖ్యాకులు,వెనుకబడిన కులాలు,దళితులు ) అమలుచేస్తోంది.ఈ మూడు వర్గాలకు చెందిన స్థానిక సంస్థల సభ్యులు కాంగ్రెస్ సభ్యుడికి ఓటువేస్తే గెలుపు సులభం అవుతుంది.కాంగ్రెస్‌పార్టీ ఇక్కడ మొగవీరరు ( కల్లుగీత కార్మికులు ) అభ్యర్థిని బరిలోనికి దింపి ఆయా వర్గాల ఓట్లను పొందటానికి ప్లాన్ చేసింది.బిజెపి కూడా బీసి అభ్యర్థిని బరిలోనికి దింపింది.

## ముడా అక్రమ నివేశనాల పంపిణి

### - ముడా అధ్యక్షుడు మరిగౌడ రాజీనామాకు సిఎం సూచన

**మైసూరు,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**



ముడా చైర్మన్ కె.మరిగౌడ

ముడా కేసులో అక్రమాలకు అవకాశం కల్పించాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ముడా అధ్యక్షుడు కె.మరిగౌడ వెంటనే రాజీనామా చేయాలని సిఎం సిద్ధరామయ్య మంగళవారం సూచించినట్లు సమాచారం. ఈకేసులో లోకాయుక్త పోలీసులు దర్యాప్తునకు దిగటంతో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా చూసేందుకు ముడా అధ్యక్షుడిని రాజీనామా చేయమని సిఎం చెప్పినట్లు సమాచారం అందింది.ముడాలో ఇపుడున్న పాలక మండలిని రద్దు చేసి మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారకు కొత్తగా అడ్మినిస్ట్రేటర్‌ను సర్కారు నియమించనుందని సమాచారం. రెండు మూడురోజుల్లో ముడాకు నూతన అడ్మినిస్ట్రేటర్ నియమిస్తారు.కొత్త పరిపాలనాధికారి నాయకత్వంలో ముడా కార్యకలాపాలు జరుపుతారు.మరిగౌడ తొందరపాటు చర్యల వలన సిఎం వర్చస్సుకు కళంకం అంటుకుందని మైసూరు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆరోపించటం మరిగౌడను తొలగించాలని వత్తిళ్లు రావటంతో సిఎం తన ఆప్తుడు మరిగౌడ చేత రాజీనామా చేయించాలని కోరారు.బుధవారం ముడా అధ్యక్షుడు సిఎంను కలుసుకుని తన రాజీనామా పత్రాన్ని ఇస్తారని ఈ వర్గాలు తెలిపాయి.

## కర్ణాటక కాంగ్రెస్ సర్కారును డిస్మిస్ చేయాలంటూ రాష్ట్రపతికి మనవి చేస్తాం

### - బిజెపి అధ్యక్షుడు విజయేంద్ర

**మంగళూరు,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**



బంట్వాళలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి అధ్యక్షుడు విజయేంద్ర

ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టని కర్ణాటక కాంగ్రెస్ సర్కారును వెంటనే డిస్మిస్ చేయాలని బిజెపి రాష్ట్ర నాయకత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును భేటిచేయనుందని రాజ్య బిజెపి అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర చెప్పారు.ఆయన మంగళవారం మంగళూరు జిల్లా బంట్వాళ తాలూకా కేంద్రంలో ఎంఎల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని తరువాత జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తాను అవినీతికి పాల్పడలేదని చెబుతూనే వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నుంచి 88కోట్ల రూపాయల నిధుల మళ్లింపునకు కారకులయ్యారని ఆరోపించారు.కాంగ్రెస్ సర్కారులోని పలువురు మంత్రులు అక్రమాలకు పాల్పడి ఇపుడు కోర్టు కేసులకు భయపడి తాము జరిపిన అక్రమాలను పరోక్షంగా అంగీకరిస్తూ నివేశనాలు భూములను సర్కారుకు వాపస్ చేస్తున్నారని చెప్పారు.గత ఏడాదిన్నరగా కాంగ్రెస్ సర్కారు ఒక్కటంటే ఒక్క కొత్త పథకాన్ని ప్రకటించలేదు. అమలుచేయనూలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలంటూ ప్రచారం చేసుకుంటున్నారే తప్పా కొత్తకార్యక్రమాలను ఏదీ ప్రకటించలేదన్నారు.సర్కారు అక్రమాలపైన ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలన్నది బిజెపి డిమాండ్ అని అన్నారు.ఈ సర్కారును ఎంత త్వరగా ఇంటికి సాగనంపింతే ప్రజలకు అంత మేలు జరుగుతుందని విజయేంద్ర అన్నారు.హుబ్బళ్లిలో 2022లో నగరంలో గొడవలకు దిగి పోలీసుస్టేషన్‌పైన దాడిచేసిన దుండగుల కేసును కాంగ్రెస్ సర్కారు రద్దుచేసి ప్రజలను మోసగించింది. కాంగ్రెస్ సర్కారు అక్రమాలను ఖండిస్తూఈనెల 25న హుబ్బళ్లిలో భారీ నిరసన ఆందోళన నిర్వహిస్తామని విజయేంద్ర చెప్పారు.

## బెళగావిజిల్లాలో చేతికి అందివచ్చిన వరిపంట వానలవలన పొలాల్లోనే మునక

**బెళగావి,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**

బెళగావి జిల్లాను గత ఆగస్టు నెలలో కురిసిన వానలు భారీ ఎత్తున నష్టపరచగా మళ్లీ హింగారు వానల వలన ఇపుడు ఈజిల్లా మరోసారి రైతాంగానికి కన్నీరు తెప్పిస్తోంది.ఈజిల్లాలోని పలుగ్రామాల్లో ముంగారు పంటలు కోతకు వచ్చే సమయంలో వానలు కురవటంతో వరిపొలాల్లో కోతకు వచ్చిన పంట వాననీటిలో తడిచి మునిగిపోయి కుళ్లిపోతుంది. జిల్లాలోని యళ్లూరు గ్రామంలో వందలాది ఎకరాల్లో రైతులు సాగుచేసిన వరిపంట కోతలు కోసే సమయంలో ఒకపక్క అగ్గితెగులుతో ఎండిపోతుంటే మరోపక్క వానలవలన పొలాల్లోనే పనలు మునిగిపోయి కుళ్లిపోయే స్థితికి చేరుకున్నాయి.యళ్లూరు గ్రామ రైతులు మంగళవారం ఈ గ్రామానికి వచ్చిన మీడియా మిత్రులకు తమ గ్రామంలో చోటుచేసుకున్న వానల హంగామ వలన తామెంతగా నష్టపోయామో మీడియాకు చూపించారు.వరిరైతులను ఆదుకోవాల్సిన వ్యవసాయఅధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవటంతో చేతికి అందివచ్చిన వరిపంట ఎందుకు పనికిరాకుండా పాడైపోయిందని రైతులు తమ బాధను వెళ్లగక్కారు.వందల ఎకరాల్లో వరిపంట ఎండిపోయినట్లు తయారై నీట మునిగిందని వాపోయారు.సర్కారు తమకు పంట నష్టం సాయం అందించి ఆదుకోవాలని గ్రామరైతులు విరూపాక్ష,రామణ్ణ నారాయణప్ప తదితరులు సర్కారుకు మనవి చేశారు.

## డబ్బు కోసం పీడించిన బావమరిదిని హత్య చేసిన బావ

**మైసూరు,అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**

మైసూరు పట్టణంలోని మేటగళ్లి ప్రాంతంలో ఒక యువకుడు తన బావను నిత్యం డబ్బు కోసం పీడించటంతో బావమరిది వేధింపులను తట్టుకోలేక వినోద్ అనే వ్యక్తి హత్యచేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మనోజ్ అనే యువకుడు నిత్యం తన బావను తాగుడు కోసం బావను పీడించేవాడు.ఇతడి ప్రవర్తనతో విసిగిపోయిన బావ సోమవారం రాత్రి అతడిని ఒక బార్‌కు పిలుచుకువెళ్లి కడుపునిండా తాగించిన తరువాత చాకుతో పొడిచి హత్యచేశాడు. ఆతరువాత అతడు పోలీసుల ముందు లొంగిపోయాడు. ఈమేరకు మైసూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసునమోదు అయ్యింది

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తులకు తీవ్ర గాయాలు

**అగళి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



ప్రమాదంలో కాలు విరిగిన వ్యక్తికి చికిత్స

మండల పరిధిలోని పి.బ్యాడిగెర గ్రామంలో రోడ్డు వెంట కాలి నడకన వెళ్తున్న వ్యక్తికి ద్విచక్ర వాహనంలో వస్తున్న మంజునాథ్ ఢీ కొనడంతో రంగప్ప (45)కు కాలు విరిగి అక్కడికక్కడే పడిపోయాడు. వాహనం తోలుతున్న మంజునాథ్‌కు కూడా తీవ్ర గాయాలు అయినట్లు తెలిసింది. రంగప్పను చికిత్స నిమిత్తం కర్ణాటక రాష్ట్రం శిర ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా, వాహనం తోలుతున్న మంజునాథ్‌కు తీవ్ర గాయాలు అవడంతో మెరుగైన చికిత్స కోసం బెంగుళూరుకు తరలించారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు పి.బ్యాడిగెర గ్రామస్తులు శివకుమార్, లోకేష్, మంజునాథ్ విషయం తెలుసుకుని 108ని అత్యవసరంగా ఫోన్ చేస్తే ఎంతకు స్పందించకపోవడంతో విధిలేక గ్రామస్తులు రంగప్పను, మంజునాథ్‌ను కర్ణాటక రాష్ట్రానికి వైద్యానికి తరలించారు. 108 వాహన సిబ్బంది ప్రమాదం జరిగినా విషయం తెలిసినా సరిగా స్పందించడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు 108 సేవలు బాధజతులకు అందాలి కానీ గంటల కొలది స్పందించడం లేదని గ్రామస్తులు 108 సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## లత్తవరం, బూదగవి గ్రామాల్లో రాయితీ పప్పుశెనగ విత్తన పంపిణీ

### - ఈ-పంట నమోదును పరిశీలించిన ఏవో జి.శుభకర్

### - వెలిగొండ, బూదగవి గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**ఉరవకొండ, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



లత్తవరంలో రైతలుకు రాయితీ పప్పుశెనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



ఈ-పంట నమోదు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న ఏవో జి.శుభకర్

మండల పరిధి లోని లత్తవరం, బూదగవి గ్రామాల్లో మంగళవారం రాయితీ పప్పు శెనగ విత్తన పంపిణీ జరిగింది. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయాధికారి జి.శుభకర్ స్థానిక ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయ కులతో కలిసి రైతులకు విత్త నాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో జి.శుభకర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు డబ్బు చెల్లించి విత్తనాలను కొని సకాలంలో విత్తనం వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన లత్తవరం గ్రామంలో ఈ-పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించారు. క్షేత్రస్థాయికి వెళ్లి వ్యవసాయ సిబ్బంది నమోదు చేసిన పంటలు. క్షేత్రస్థాయిలో పంటలు ఒకటేనా ఎక్కడైనా పొరపాట్లు జరిగాయా అన్న విషయమై ఆన్‌లైన్ వివరాలను పరిశీలించారు. వెలిగొండ, బూదగవి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పంటలను పరిశీలించి చీడపీడలను అరికట్టడానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యురాలు డాక్టర్ శ్రీవిద్య, తెలుగుదేశం పార్టీ నాయకులు బోదపాటి గోవిందు, ఛత్రగుడి చిరంజీవి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది షఫీ, శ్రీలీల, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ 10 పారాసెట్మాల్ మాత్రలతో కూడిన ఫస్ట్ ఎయిడ్ కిట్లు

### - భారీ వర్షాల నేపధ్యంలో ముందు జాగ్రత్త చర్యలు

**ఉరవకొండ, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



పంచాయతీ కార్యదర్శులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందిస్తున్న ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్

భారీ వర్షాల నేపధ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల ఎటువంటి వ్యాధులు ప్రబల కుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ 10 పారాసెట్మాల్ మాత్రలతో కూడిన ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ బి.వి. రవిప్రసాద్ సూచించారు. పట్టణం లోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సీజినల్ వ్యాధులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు 30వేల పారాసెట్మాల్ మాత్రలతో కూడిన ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్ మాట్లాడుతూ బుధవారం నుండి ఆశ, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలతోపాటు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి భారీ వర్షాలపై అవగాహన కల్పించి మందులను పంపిణీ చేయాలని కోరారు. జాతీయ కీటక జనిత వ్యాధులను నియంత్రణ కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని దోమలవల్ల మలేరియా, డెంగ్యూ, మెదడువాపు, చికెన్ గున్యా తదితర సీజినల్ వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఇంటింటికీ ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎ.శంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉడుపి జిల్లాలో ఇంటి విద్యుత్ మీటర్‌పైన పిడుగు పడి ముగ్గురు యువకులకు గాయాలు

**కార్కళ (ఉడుపిజిల్లా ),అక్టోబర్ 15,ప్రభాతవార్త ప్రతినిధి**

ఉడుపి జిల్లా కార్కళ తాలూకా మియ్యారు గ్రామంలో మంగళవారం వేకువ జామున ఒక ఇంటిపైన పిడుగు పడటంతో ఇంటిలోని ముగ్గురు యువకులకు తీవ్రమైన గాయాలయ్యాయి.పోలీసులు తెలిపిన వివరాల మేరకు మియ్యారు గ్రామంలో ఇంటిబయట ఉన్న విద్యుత్ మీటరుపైన పిడుగుపడటంతో వెంటనే ఇంట్లో ప్రేలుడు సంభవించి ప్రదీప్,ఆనంద్, సుదీప్ అనే యువకులకు గాయాలయ్యాయి.గాయపడిన యువకులను పోలీసులు కార్కళ ఆసుపత్రిలో చికిత్సకోసం చేర్చారు.ఉడుపి జిల్లాలో మూడురోజులుగా భారీగా వానలు కురుస్తున్నాయి.

## పరిటాల శ్రీరామ్‌ను కలిసిన జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు

**ధర్మవరం రూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



శ్రీరామ్‌కు పుష్పగుచ్చాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విద్యుత్‌శాఖ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన సురేంద్రతోపాటు ఈఈగా బాధ్యతలు చేపట్టిన శివరాంలు ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను అనంతపురం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ అధికారులతో మాట్లాడుతూ..జిల్లాలోఎక్కడ విద్యుత్, అంతరాయం, కొరత లేకుండా 24 గంటలపాటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేలా కృషి చేయాలని ఆయన అధికారులను కోరారు.

## ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు

**ధర్మవరం రూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



శోభాయమానంగా అలంకరించిన వాసవి కన్యకాపరమేశ్వరి దేవి

పట్టణంలోని కెపిటి వీధిలో గల వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ, వాసవి మహిళా మండలి, ఆర్యవైశ్య యువజన సంఘం తదితర అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలను ఈ నెల మూడవ తేది నుండి 15వ తేది వరకు 13 రోజులు పాటు నిర్వహించారు. పది రోజులుగా అమ్మవారు వివిధ అలంకరణ రూపాలలో భక్తాదులకు దర్శనమిచ్చారు. చివరి రోజు మంగళవారం వాసవి మాతకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చకులు నారాయణమూర్తి, చంద్రశేఖర శర్మ అమ్మవారిని వివిధ పూలలతో అలంకరించిన వైనం అందరినీ ఆకట్టుకుంది. తదుపరి అమ్మవారికి వివిధ అభిషేకాలతోపాటు సంప్రోక్షణ కార్యక్రమం కూడా ఆర్యవైశ్యులు, భక్తాదులు, దాతల నడుమ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని అధ్యక్షురాలు పోడమల రూపరాగిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్య వైశ్యులు, ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ, అనుబంధ సంస్థలు పాల్గొన్నారు.

## పెద్దకోట్లలో పల్లె పండుగ

**తాడిమర్రి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



పనులను ప్రారంభిస్తున్న ఏపిడి

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామంలోని రూట్ టాప్ రెయిన్ వాటర్ హార్వేస్టింగ్ సిస్టం పనులను, అలాగే 2024-25 సంవత్సరంలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద మంజూరు అయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపిడి వెంకటాచలపతి, ఎండిఓ రంగారావు, ఈఓఆర్డి విజయశేఖర్‌నాయుడు, ఏపిఓ సంజీవరెడ్డి, పాల్గొని పల్లె పండుగ కార్యక్రమ వివరాలను, ప్రత్యేకతలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని చిల్లకొండాయిపల్లి గ్రామంలో సైతం ఇవే పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొంక నాగార్జున, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

**కళ్యాణదుర్గం టౌన్, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళ్యాణదుర్గం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఎపిజె అబ్దుల్ కలాం 94వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.జయరామరెడ్డి మాట్లాడుతూ.. 1931 అక్టోబర్ 15న ఆవుల్ పకీర్ జైనుల్లాబ్దిన్ అబ్దుల్ కలాం తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు. భారత క్షిపణి వ్యవస్థ పితామహుడు, 11వ రాష్ట్రపతి, ఈయన ఆత్మకథ వింగ్స్ ఆఫ్ ఫైర్ ఆటో బయోగ్రఫీని ప్రత్యేక విద్యార్థి కూడా చదవాలి, కలాం కలలు కనండి ఆ కలలను సాకారం చేసుకోండి అనే నినాదం ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలి. అంతేకాకుండా రాష్ట్రపతిగా పదవీనంతరం, ఆయన ఉపాధ్యాయ వృత్తి ఎంతగానో ఇష్టం, విద్యార్థులకు బోధిస్తూ ఐఐఎం పిల్లాంగ్‌లో మరణించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన ఇసపాల్ శేషయ్య, సూర్యనాగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీధర్, రవిశంకర్ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతి చెందిన పారిశుద్ధ్య కుటుంబాలకు నగదు అందజేత

**ధర్మవరం రూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



పారిశుద్ధ్య కుటుంబానికి నగదు అందజేస్తున్న దృశ్యం

ఇటీవల కాలం లో ధర్మవరం మున్సిపల్ పారి శుద్ధ్య కార్మికులు వివిధ ఘటనల్లో మృతిచెందిన కుటుంబాలకు సిఐటియు ఆధ్వర్యంలో నగదును అందజేశారు. మృతుడు నాగేంద్ర కుటుంబానికి 39,600 మల్లికార్జున కుటుంబానికి 35,600 నగదును ఇరువురి కుటుంబాలకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జేవి.రమణ, అయూబ్ ఖాన్, వెంకటేష్, మున్సిపల్ కార్మికసంఘం కార్మికనాయకులు పాల్గొన్నారు.

